నమస్తే తెలంగాణ
ములుగు
జయశంకర్ భూపాలపల్లి
5 | మంగళవారం 13 ఆగస్టు 2024 | MULUGU JAYASHANKAR BHUPALPALLY


# శ్రమదానం కాదు.. శిక్ష

- మద్యం తాగి వాహనం నడిపినందుకు జడ్జి పనిష్‌మెంట్
- ఒకరోజు సమాజ సేవ చేయాలని ఆదేశాలు



తహసీల్దార్ కార్యాలయంలో పిచ్చి మొక్కలు తొలగిస్తున్న వాహనదారుడు

సుబేదారి/వేలేరు, ఆగస్టు 12 : ఈ ఫొటోలో కనిపిస్తున్న వ్యక్తి శ్రమదానం చేస్తున్నాడ కుంటే పొరపాటే. ఫుల్లుగా మద్యం తాగి వాహనం నడిపినందుకు అతడికి న్యాయమూర్తి వేసిన శిక్ష. జనగామ జిల్లా చిల్పూరు మండలం రాజవరం గ్రామానికి చెందిన బాబీ శుక్రవారం డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో వేలేరు ఎస్సై అజ్మీరా సురేశ్‌కు చిక్కారు. ఈమేరకు సోమవారం పోలీసులు హనుమకొండ రెండో తరగతి కోర్టు న్యాయమూర్తి ఎదుట హాజరుపర్చగా, ఒకరోజు సమాజ సేవ చేయాలని తీర్పు ఇచ్చారు. అనంతరం పోలీసులు బాబీని వేలేరు తహసీల్‌కు తీసుకొచ్చి తహసీల్దార్ హెచ్.కొమి బాబీకి ఆఫీసు ఆవరణలోని పిచ్చి మొక్కలు, గడ్డిని తొలగించే పని అప్పజెప్పారు. వరంగల్ కమిషనరేట్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వ్యక్తికి ఈ రకమైన శిక్ష విధించడం ఇదే మొదటిసారి కావడం విశేషం.



ములుగులో కలెక్టరేట్ వద్ద దరఖాస్తులు ఇచ్చేందుకు బారులు తీరిన ప్రజలు

# ఎంజీఎం.. నిండా నిర్లక్ష్యం

## పాలకుల పట్టింపులేక నిర్వహణ అస్తవ్యస్తం

**పేదల పెద్దాసుపత్రి ఎంజీఎం పరిస్థితి అధ్వానంగా మారింది. పాలకులు, పాలనాధికారులు పట్టింపులేక నిర్వహణ అస్తవ్యస్తంగా ఉంది. మొన్నటి పసికందు ఘటన తర్వాతే తీరు మారకపోగా నిండా నిర్లక్ష్యమే కనిపిస్తోంది. మళ్లీ ఎప్పటిలాగే దవాఖాన ఆవరణలో వీధి కుక్కల స్వైరవిహారం, మందుబాబులు తాపీగా చిల్ కొట్టి వదిలి వెళ్లిన బీరు సీసాలు భద్రతా వైఫల్యానికి సాక్ష్యంగా నిలుస్తున్నాయి. అంతేగాక పలు విభాగాల్లో పేరుకుపోయిన వ్యర్థాలు, చెత్తాచెదారాన్ని తొలగించకుండా చోద్యం చేస్తున్నారు. అలాగే దవాఖానకు వచ్చే ప్రధాన దారులు సైతం గుంతలమయం కాగా, క్యాజువాలిటీ వద్ద ఎండిపోయిన ఓ భారీ చెట్టు ప్రమాదకరంగా మారి ఎప్పుడు కూలుతుందోనని రోగులు, అటెండెంట్లు భయాందోళన చెందుతున్నారు. ఇటు వర్షాలు, విషజ్వరాల సీజన్‌లో అనుక్షణం అప్రమత్తంగా ఉంటూ వైద్య సేవలందించడంతో పాటు దవాఖానను పరిశుభ్రంగా ఉంచాల్సింది పోయి ఇలా గాలికొదిలేయడంపై ప్రజలు మండిపడుతున్నారు.**

*- వరంగల్ చౌరస్తా, ఆగస్టు 12*



ఎంజీఎం గేట్ నంబర్ 2 ముందు నిలిచిన నీరు

### ఇలాగైతే వెళ్లేదెలా?

ఎంజీఎం హాస్పిటల్‌కు మూడు మెయిన్ గేట్లు ఉన్నాయి. అత్యవసర విభాగానికి చేరుకునే అంబులెన్స్‌లు, ఇతర వాహనాలు మొదటి గేటు గుండా, ఓపీ సేవలు వినియోగించుకునే వారు రెండో గేటు ద్వారా వస్తుంటారు. ఈ రెండు గేట్ల ద్వారా నిత్యం ఎంతోమంది రోగులు, అటెండెంట్లు నడుచుకుంటూ వస్తారు. కానీ ఈ రోడ్డుపై గుంతలు పడి, ఇనుప చువ్వలు తేలినా మరమ్మతులు చేయకపోవడంతో వారు ఇబ్బంది పడుతున్నారు.



అత్యవసర విభాగం గేటు ముందు తేలి ఉన్న ఇనుప చువ్వలు



ఎంజీఎం ఆవరణలో సంచరిస్తున్న వీధికుక్క

### ఎటుచూసినా కుక్కలే

ఎంజీఎం ఆవరణలో ఎక్కడ చూసిన కుక్కలే కనిపిస్తున్నాయి. ఇటీవల మృతశిశువు ఘటన తర్వాత మంత్రి ఆదేశాలతో మున్సిపాలిటీ వారు 12 కుక్కలను పట్టుకున్నా ఎంజీఎంలో కుక్కల సంచారం ఆగలేదు. ముఖ్యంగా జన సంచారం తక్కువగా ఉండే పీడియాట్రిక్, మానసిక వైద్యవిభాగం ప్రాంతాల్లో కుక్కల స్వైరవిహారం ఎక్కువ ఉంటున్నదని, రాత్రి వేళ అటువైపు వెళ్లేందుకు అటెండెంట్లు, సిబ్బంది సైతం జంకుతున్నారు.

- పసికందు ఘటన తర్వాతా మారని తీరు
- ఇటు కుక్కలు.. అటు మందుబాటిళ్లు
- చెత్తాచెదారం, వ్యర్థాలతో అపరిశుభ్రంగా పరిసరాలు
- రాత్రివేళల్లో మందుబాబుల విందులు
- క్యాజువాలిటీ వద్ద ప్రమాదకరంగా చెట్లు
- గుంతలమయమైన ప్రధాన ద్వారాలు
- ఇబ్బంది పడుతున్న రోగులు, అటెండెంట్లు

కొవిడ్ సమయంలో ఎన్నో వేల ప్రాణాలు నిలబెట్టిన ఎంజీఎం దవాఖాన ప్రతిష్ట ఇప్పుడు రోజురోజుకూ మసకబారుతోంది. ప్రభుత్వం, ఉన్నతాధికారుల చిన్నచూపు వల్ల వైద్య సేవలు, మౌలిక వసతులు కరువయ్యాయి. అంతర్గత రోడ్లు, పరిశుభ్రత, భద్రత అంశాలపై దృష్టి పెట్టకపోవడంతో దవాఖాన అస్తవ్యస్తంగా మారింది. ఇటీవల శిశువు మృతదేహాన్ని కుక్కలు పీక్కుతున్న ఘటన జరిగిన తర్వాత కూడా నిఘా పెట్టకపోవడమే గాక కొత్త సీసీ కెమెరాలు అమర్చకుండా కాలయాపన చేస్తుండడం విమర్శలకు తావిస్తోంది. ఎంజీఎంకు వచ్చే రోగుల ఆరోగ్యాన్ని మెరుగుపరచడంతో పాటు వారి ప్రాణాలకు, భద్రతకు భరోసా కల్పించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



పీడియాట్రిక్ విభాగంలో పేరుకుపోయిన చెత్త

### రాత్రి అయ్యిందంటే విందులే

వైద్యం కోసం వచ్చే రోగుల అటెండెంట్లు రాత్రయ్యిందటే చాలు ఎంజీఎం ఆవరణలోనే మందు విందులు చేసుకుంటున్నారు. భద్రతా సిబ్బంది పట్టించుకోకపోవడం, అధికారులు మచ్చుకైనా కనిపించకపోవడం, కరోనా, పీడియాట్రిక్, ఆంకాలజీ విభాగాల ప్రాంతంలో జనసంచారం లేకపోవడం వల్ల అర్ధరాత్రి వేళ అక్కడే మందు కొడుతున్నారు. కొన్ని విభాగాల్లో సిబ్బంది ఏమరపాటుగా ఉన్న సమయాల్లో రోగులు సైతం విభాగాలు దాటి వచ్చి ధూమపానం చేస్తున్నట్లు సిబ్బంది చెబుతున్నారు. దీనికి తోడు ఎంజీఎం ఆవరణలో కొందరు చిరువ్యాపారులు నిబంధనలను తుంగలో తొక్కి సిగరెట్లు, గుట్కాల విక్రయిస్తుండడంతో ఇతర ప్రాంతాల నుంచి యువత ఎక్కువ సంఖ్యలో ఎంజీఎంకు చేరుకుంటున్నట్లు తెలుస్తోంది.



విందు చేసుకొని వదిలివెళ్లిన బీరు సీసాలు

### ఎండిన చెట్లతో భయంభయం



నేల కూలడానికి సిద్ధంగా ఉన్న ఎండిపోయిన చెట్లు

అత్యవసర విభాగం అనుక్షణం రోగులు, క్షతగాత్రుల రాకపోకలతో నిత్యం బిజీగా ఉంటుంది. 108 అంబులెన్సులు, ప్రైవేట్ అంబులెన్స్‌లు సైతం అత్యవసర వైద్యసేవల కోసం ఇక్కడికే తీసుకొస్తుంటారు. ఇక్కడే ఉన్న రెండు భారీ చెట్లు ఎండిపోయి గాలివానకు ఎప్పుడు విరిగిపడుతాయోనని భయంభయంగా వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఎవరికీ ప్రమాదం జరుగకముందే తొలగించాలని కోరుతున్నారు. ఇటీవల తిరుపతిలో ఓ భక్తురాలిపై ఎండిన చెట్టు కొమ్మ విరిగిపడిన ఘటన సోషల్ మీడియాలో వైరల్ అయిన విషయాన్ని గుర్తుచేసుకుంటున్నారు.

# గోడు చెప్పుకోవాలంటే వెయిట్ చేయాల్సిందే..

## ములుగు ప్రజావాణిలో దివ్యాంగులు, వృద్ధుల పాట్లు

ములుగు, ఆగస్టు 12 (నమస్తే తెలంగాణ) : సోమవారం ములుగు కలెక్టరేట్‌లో ప్రజావాణికి వచ్చిన ప్రజలు కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు పడ్డారు. ఉదయం 10గంటలకే చేరుకున్నా కూర్చునేందుకు కుర్చీలు లేక మహిళలు, దివ్యాంగులు, వృద్ధులు బయటే నిరీక్షించారు. 11గంటలకు ఆర్డీవోతో పాటు రెవెన్యూ అడిషనల్ కలెక్టర్ వచ్చినప్పటికీ కలెక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ 11.30 గంటలకు అర్జీలు స్వీకరించే సమావేశ మందిరంలోకి చేరుకున్న తర్వాతనే ప్రజలు ముందుకు కదిలారు. అయితే సమావేశ మందిరంలో కుర్చీలు ఖాళీగానే ఉన్నప్పటికీ అర్జీదారులను అనుమతించకుండా ఒక్కొక్కరినే లోపలికి పంపించారు. రసీదుల కోసం కూడా ప్రజలు చాలా సేపు వేచిచూశారు. తాగునీటి సౌకర్యంతో పాటు కూర్చునేందుకు కుర్చీలు లేదా బెంచీలు ఏర్పాటుచేయాలని అర్జీదారులు కోరుతున్నారు.

# కాళోజీ కళా క్షేత్రానికి రూ. 45 కోట్లు మంజూరు

**జీవో జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం**

వరంగల్, ఆగస్టు 12 : వరంగల్ నగరం నడిబొడ్డున నిర్మిస్తున్న కాళోజీ కళాక్షేత్రానికి రాష్ట్ర ప్రభుత్వం మరిన్ని నిధులను విడుదల చేసింది. ఈ నెల చివరి వరకు కళాక్షేత్రం నిర్మాణం పూర్తి చేయాలన్న సంకల్పంతో ప్రభుత్వం మరో రూ. 45 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. తొలుత టూరిజం శాఖ ఆధ్వర్యంలో రూ. 50 కోట్లతో కళాక్షేత్రం నిర్మాణ పనులు ప్రారంభించారు. తర్వాత పనులను కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థకు అప్పగించారు. అపై కాళోజీ కళాక్షేత్రం నిర్మాణ అంచనా వ్యయం రూ. 80.10 కోట్లకు పెరిగింది. దీంతో రూ.45 కోట్లు మంజూరు చేస్తూ మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దాన కిశోర్ ఉత్తర్వులు జారీ చేశారు.

# తండ్రి మృతిని తట్టుకోలేక.. తనయుడు..

## పెద్దంపేటలో విషాదం



లస్మయ్య, కృష్ణంరాజు(ఫైల్)

మహదేవపూర్,ఆగస్టు 12: తండ్రి మృతి తట్టుకోలేక తనయుడు హఠాన్మరణం చెందిన ఘటన మండలంలోని పెద్దంపేట గ్రామంలో సోమవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బీసుల లస్మయ్య(62) సోమవారం గుండెపోటుతో మృతి చెందాడు. అంత్యక్రియలను నిర్వహించిన కొడుకు కృష్ణంరాజు(30) ఇంటికి వచ్చి తండ్రి చనిపోయిన బాధతో కుమిలిపోయి సొమ్మసిల్లి పడిపోయాడు. గమనించిన కుటుంబసభ్యులు భూపాలపల్లి ఆసుపత్రికి తరలించగా అప్పటికే కృష్ణంరాజు మృతి చెం దినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య, 8 నెలల కుమారుడు, సోదరుడు ఉన్నారు. ఒకే కుటుంబంలో తండ్రి, కొడుకుల మృతితో పెద్దంపేట గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నారు. కుటుంబసభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు.

# మృతశిశువుకు పోస్టుమార్టం పూర్తి

వరంగల్ చౌరస్తా, ఆగస్టు 12 : ఇటీవల ఎంజీఎం అత్యవసర విభాగం పక్కన గుర్తించిన మృత శిశువుకు ఫోరెన్సిక్ విభాగం వైద్యులు పోస్టుమార్టం నిర్వహించారు. సోమ వారం మట్టెవాడ పోలీసులు పంచనామా నిర్వహించిన తర్వాత పోస్టుమార్టం పూర్తి చేశారు. కుక్కలు నోట కరిచిన కారణంగా అప్పటికే మరణించినట్లుగా నిర్ధారణకు వచ్చి నట్లు తెలిపారు. శిశువు లింగ నిర్ధారణకు డీఎన్ఏ పరీక్షల కోసం నమూనాలను సేకరించి హైదరాబాద్‌కు పంపినట్లు అధికారులు తెలిపారు. మార్చురీ వద్ద పంచనామా తర్వాత మట్టెవాడ పోలీసులు ఎంజీఎం సూపరింటెండెంట్‌ను కలిసి సమాచారం నమోదు చేసుకున్నారు.

# లైంగికదాడి యత్నానికి పాల్పడిన వ్యక్తికి పదేళ్ల జైలు

చెన్నారావుపేట, ఆగస్టు 12: బాలికపై లైంగికదాడి యత్నానికి పాల్పడిన వ్యక్తికి వరంగల్ కోర్టు పదేళ్ల జైలు శిక్ష విధించింది. ఎస్సై అరుణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఓ గ్రామంలో బాలికపై రఘుపతి అనే వ్యక్తి లైంగికదాడికి యత్నించాడు. బాలిక కేకలు వేయడంతో పారిపోయాడు. తల్లిదండ్రులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్సై మహేందర్ పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. సరైన ఆధారాలు సేకరించి కోర్టు ముందు హాజరు పరచగా సోమవారం వరంగల్ ఫస్ట్ క్లాస్ అడిషనల్ జడ్జి ప్రేమలతారెడ్డి నిందితుడికి పదేళ్ల జైలు శిక్ష, రూ.1000 జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. బాధితురాలికి రూ. లక్ష పరిహారం చెల్లించాలని ఆదేశించారు.

# మానుకోట డీటీవో గౌస్ పాషా అరెస్ట్

## మరో ఇద్దరు కూడా..



డీటీవో మహ్మద్ గౌస్ పాషా(మధ్యలో), డ్రైవర్ సుబ్బారావు, ప్రైవేట్ వ్యక్తి రాంగోపాల్

మహబూబాబాద్, ఆగస్టు 12 (నమస్తే తెలంగాణ): అనేక అవినీతి, అక్రమాలకు పాల్పడిన మహబూబాబాద్ జిల్లా రవాణా శాఖ అధికారి మహ్మద్ గౌస్ పాషాతోపాటు అతని డ్రైవర్ ఎలమందల సుబ్బారావు, ప్రైవేట్ వ్యక్తి రాంగోపాల్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళ్తే.. మహబూబాబాద్ డీటీవోగా గౌస్ పాషా విధుల్లో చేరినప్పటి నుంచి అనేక అవినీతి ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ క్రమంలో కొంతమంది వాహనదారులు ఏసీబీ అధికారులకు లేఖలు రాయడంతో వారు గత మే 28న రవాణా శాఖ కార్యాలయంలో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా డ్రైవర్ సుబ్బారావు వద్ద లెక్కల్లో చూపని రూ.61,600 నగదుతో పాటు అతని వద్ద లభ్యమైన మొబైల్ ఫోన్‌ను ఏసీబీ అధికారులు స్వాధీన పరుచుకున్నారు. అనంతరం మొబైల్ ఫోన్‌ను క్షుణ్ణంగా తనిఖీ చేయగా రోజు వచ్చే లంచాలు, నెలనెలా వచ్చే మామూళ్లతోపాటు వివిధ బ్యాంకు ఖాతాలకు సంబంధించిన లావాదేవీలను గుర్తించారు. కరీంనగర్, ఖమ్మం జిల్లాల్లో పనిచేసిన సమయంలో అతని కుమారుడు మహ్మద్ అరీఫుద్దీన్, మేనల్లుడు మహ్మద్ మునీర్‌తో కలిసి రూ.2.97లక్షలు లంచం వసూలు చేసినట్లు విచారణలో తేలింది. ఇవి కాకుండా మరిన్ని అక్రమాలు వెలుగుచూడడంతో ఈ నెల 11న ముగ్గురిని అరెస్ట్ చేసి సోమవారం వరంగల్‌లోని ఏసీబీ ప్రత్యేక కోర్టులో హాజరుపరిచి జైలుకు తరలించారు.

**ఇన్‌చార్జి డీటీవోగా సాయి చరణ్**

మహబూబాబాద్ రూరల్, ఆగస్టు 12 : జిల్లా ఇన్‌చార్జి రవాణా శాఖ అధికారిగా సాయిచరణ్ సోమవారం సాయంత్రం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వర్తించిన డీటీవో గౌస్‌పాషాను ఏసీబీ అధికారులు అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. దీంతో ఇన్‌చార్జి డీటీవోగా సాయిచరణ్‌ను నియమిస్తూ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు.

# చెరువులో విగత జీవులుగా..

- రాయపర్తిలోని రామచంద్రుని చెరువులో యువతి, యువకుడి మృతదేహాలు లభ్యం
- ఆత్మహత్య చేసుకున్నట్లుగా అనుమానం
- పైడిపల్లి పరిధి మధ్యగూడెం వాసులుగా గుర్తింపు



అంజలి, దిలీప్ (ఫైల్)



చెరువు కట్టపై వదిలిన బైక్

రాయపర్తి, ఆగస్టు 12 : వరంగల్ జిల్లా రాయపర్తి మండల కేంద్రంలోని కొండూరు రోడ్డులోఉన్న రామచంద్రుని చెరువులో ఓ యువతి, యువకుడి మృతదేహాలు సోమవారం లభ్యమయ్యాయి. చెరువు కట్టపై పల్సర్ బైక్, యువతి హ్యాండ్ బ్యాగ్ లభించడంతో వారిని హనుమకొండ మండలం పైడిపల్లి గ్రామ పరిధి మధ్యగూడేనికి చెందిన తిక్క అంజలి (26), సంగాల దిలీప్ (30)గా గుర్తించారు. ఆదివారమే వారు చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు అనుమానిస్తున్నారు. స్థానికులు తెలిపిన, మృతుల వద్ద లభించిన ఆధారాల మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని జేరుతండాకు చెందిన కొందరు కాపరులు మేకలను మేపేందుకు చెరువు వద్దకు వెళ్లగా నీటిపై మృతదేహాలు తేలియాడుతూ కనిపించాయి. వారిచ్చిన సమాచారం మేరకు వర్ధన్నపేట ఏసీపీ అంబటి నర్సయ్య, సీఐ జీడి సూర్యప్రకాశ్, ఎస్సై ప్రవీణ్‌కుమార్ ఘటనా స్థలికి చేరుకొని క్లూస్‌టీం సహాయంతో విచారణ చేపట్టారు. ఈ క్రమంలో వారికి చెరువు కట్టపై బైక్, హ్యాండ్‌బ్యాగ్, నీళ్లబాటిల్, మృతుల చెప్పులు లభించగా వాటి ఆధారంగా వారిని మధ్యగూడేనికి చెందిన అంజలి, దిలీప్‌గా గుర్తించారు. వారిద్దరిదీ ఒకే గ్రామం కావడంతో వారి మధ్య ప్రేమ వ్యవహారం ఉంటుందని కొందరు, వివాహేతర సంబంధం కావచ్చని మరికొందరు చర్చించుకుంటున్నారు. కాగా మృతుడు దిలీప్‌కు నెక్కొండ మండలంలోని బంజర్‌పల్లి గ్రామానికి చెందిన శిరీషతో వివాహం కాగా ఇద్దరు ఆడ పిల్లలున్నట్లు సమాచారం. మృతులిద్దరి మధ్య ఉన్న వివాహేతర సంబంధం కారణంగా దిలీప్ కుటుంబంలో తరచూ గొడవలు జరుగుతుండడంతో అతడి భార్య శిరీష ఐదేళ్ల నుంచి తన తల్లిగారింట్లోనే ఉంటున్నట్లు తెలిసింది. వీరి ఆత్మహత్యకు సంబంధించి ఇంకా పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. కాగా, చెరువులో నుంచి మృతదేహాలను బయటకు తీయించిన పోలీసులు శవ పంచనామా నిర్వహించిన అనంతరం పోస్టుమార్టం నిమిత్తం వరంగల్‌లోని ఎంజీఎంకు తరలించారు. కేసు నమోదు చేసుకొని విచారణ జరుపుతున్నారు.

**పైడిపల్లి పరిధి మధ్యగూడెంలో విషాదం**

కాశీబుగ్గ : గ్రేటర్ వరంగల్‌లోని 3వ డివిజన్ పైడిపల్లిలోని మధ్యగూడెంకు చెందిన దిలీప్, అంజలి ఆత్మహత్మ చేసుకోవడంతో ఆ గ్రామంలో విషాదం నెలకొంది. వివాహితుడైన దిలీప్ హనుమకొండ హంటర్‌రోడ్‌లోని మార్బుల్‌షాపులో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. అతడికి వరుసకు సోదరి అయిన అంజలి ప్రైవేట్ ఆస్పత్రిలో పనిచేస్తున్నట్లు తెలిసింది. విషయం తెలిసిన వెంటనే స్థానికులు, బంధువులు పెద్ద ఎత్తున వారి ఇళ్లకు చేరుకొని కన్నీటి పర్యంతమయ్యారు.

# ఏసీబీకి చిక్కిన ఇరిగేషన్ ఏఈ

- కాసుల కోసం కక్కుర్తి పడిన గ్రామ ప్రత్యేకాధికారి
- జీపీ అభివృద్ధి పనుల బిల్లుల కోసం లంచం డిమాండ్
- రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న అవినీతి నిరోధక శాఖ అధికారులు



ఏసీబీ అధికారులకు పట్టుబడిన ఏఈ గోపాల్

సుబేదారి/పాలకుర్తి రూరల్, ఆగస్టు12: ఇరిగేషన్ ఏఈ గోపాల్ ఏసీబీకి చిక్కాడు. సర్పంచ్ భర్త నుంచి లంచం తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. చిత్తశుద్ధితో విధులు నిర్వర్తించాల్సిన ప్రత్యేకాధికారి కాసుల కోసం కక్కుర్తి పడి అడ్డంగా దొరికిపోయాడు. ఏసీబీ డీఎస్పీ సాంబయ్య తెలిపిన వివరాల ప్రకారం.. నీటిపారుదల శాఖ పాలకుర్తి సబ్ డివిజన్‌లో గుగులోత్ గోపాల్ ఏఈగా విధులు నిర్వర్తిస్తున్నాడు. సర్పంచ్‌ల పదవీ కాలం ముగియడంతో గోపాల్‌ను ప్రభుత్వం గుడికుంట తండా, మంచుప్పుల, చెన్నూరు గ్రామాలకు ప్రత్యేకాధికారిగా నియమించింది. గుడికుంట తండా తాజా మాజీ సర్పంచ్ బానోత్ కాంతి, ఆమె భర్త యాకూబ్‌నాయక్ దంపతులు గ్రామాభివృద్ధికి రూ.75వేలు ఖర్చు చేశారు. ఇందుకు సంబంధించిన బిల్లుల కోసం గ్రామ ప్రత్యేకాధికారి గోపాల్‌ను యాకూబ్‌నాయక్ కలవగా తనకు రూ. 10వేలు ఇస్తేనే సంతకం చేస్తానని చెప్పాడు. దీంతో ఆయన విసుగు చెంది శుక్రవారం రూ.6వేలు ఇస్తానని ఒప్పుకుని ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ఈ క్రమంలో సోమవారం హనుమకొండ నక్కలగుట్ట ఎస్‌బీఐ సమీ పంలో రూ. 6వేలు లంచం తీసుకుంటుండగా ఏఈ గోపాల్‌ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు డీఎస్పీ సాంబయ్య తెలిపారు. ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకుని రెండు గంటలపాటు విచారించినట్లు తెలిసింది.

# అత్త మామలపై అల్లుడి దాడి

- మామ మృతి.. అత్తకు తీవ్ర గాయాలు
- భార్యను పంపడం లేదని ఘాతుకం



నర్సయ్య (ఫైల్)

మంగపేట, ఆగస్టు 12 : భార్యను కాపురానికి పంపడం లేదని అత్త మామలపై అల్లుడు కత్రతో దాడి చేయడంతో మామ మృతి చెందగా, అత్తకు గాయాలయ్యాయి. ఈ ఘటన ములుగు జిల్లా మంగపేట మండలం బాలన్నగూడెం పరిధి నీలాద్రిపేటలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. స్థానిక ఎస్సై టీవీఆర్ సూరి కథనం మేరకు.. గ్రామానికి చెందిన గొర్రె నర్సయ్య- నర్సక్క దంపతులకు ముగ్గురు కుమార్తెలు కాగా రెండో కూతురు స్వప్నను 17 ఏళ్ల క్రితం అదే గ్రామానికి చెందిన గాంధర్ల రామకృష్ణకు ఇచ్చి పెళ్లి చేశారు. అయితే రామకృష్ణ నాలుగేళ్ల క్రితం అదే గ్రామానికి చెందిన మరో మహిళను వివాహం చేసుకోగా, స్వప్న అతడిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. అప్పటి నుంచి స్వప్న తల్లిదండ్రుల వద్దే ఉంటున్నది. ఈ క్రమంలో రామకృష్ణ ఆదివారం రాత్రి నర్సయ్య, నర్సక్కలపై కత్రతో దాడి చేయగా ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. వారిని ములుగు జిల్లా కేంద్రంలోని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ నర్సయ్య(56) మృతి చెందాడు. నర్సక్కను మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎం దవాఖానకు తరలించి చికిత్స అనంతరం గ్రామానికి తీసుకొచ్చారు. కాగా, ఏటూరునాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ సోమవారం సాయంత్రం నీలాద్రిపేటకు చేరుకొని ఘటనా స్థలిని సందర్శించి దాడి జరిగిన విధానాన్ని నర్సక్కను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట సీఐ శ్రీనివాస్, ఎస్సై టీవీఆర్ సూరి ఉన్నారు. మృతుడి చిన్న కూతురు సౌజన్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# జీరో బిల్లు, గ్యాస్ సబ్సిడీ వచ్చేనా?

## కమలాపూర్ వద్ద జీపీ వద్ద పడిగాపులు




మరోసారి దరఖాస్తులు చేసుకునేందుకు వచ్చిన బాధితులు

మంగపేట, ఆగస్టు 12 : గతంలో అధికారులు స్వీకరించిన ప్రజాపాలన ఆరు గ్యారెంటీల దరఖాస్తులో ఉచిత కరెంటు కోసం గృహజ్యోతి, రాయితీ గ్యాస్ కోసం మహాలక్ష్మి ఆప్షన్లు ఎంచుకున్నా లబ్ధిదారులకు అవి వర్తించకపోవడంతో బాధితులు కార్యాలయాల చుట్టూ చెప్పులు అరిగేలా తిరుగుతున్నారు. మంగపేట మండలంలో పలువురు వివరాలను ఇష్టారాజ్యంగా అప్‌లోడ్ చేయడంతో దరఖాస్తుదారులు ఇబ్బంది పడుతున్నారు. మేజర్ గ్రామ పంచాయతీ అయిన కమలాపురం నుంచి వందలాది మంది నిత్యం మండల పరిషత్‌కు వెళ్లి మొరపెట్టుకుంటున్నారు. దీని వల్ల తమ పనులు ఆటంకం అవుతున్నాయని అధికారులే కమలాపురం జీపీ వద్ద సోమవారం దరఖాస్తులు స్వీకరించారు. అయితే కేవలం పేరు, ఆధార్ మిస్ మ్యాచింగ్ అయిన వారి నుంచి మాత్రమే వివరాలు తీసుకుంటున్నారు. తమకు అవసరమైన పథకానికి టిక్ మార్కు పెట్టి మరీ దరఖాస్తు చేసినా ఆపరేటర్ల పొరపాటు వల్ల ఉచిత విద్యుత్, వంట గ్యాస్ రాయితీ కోల్పోయామని వాటిని ఎడిట్ చేసే ఆప్షన్ మాత్రం ప్రభుత్వం నుంచి రాకపోవడంతో బాధితులు తీవ్ర నిరాశకు గురవుతున్నారు.